సంపుటి : 11
సంచిక : 7
అక్టోబర్ : 2011

# రచన ఇంటింటిపత్రిక

227

పేజీలు : 100
వెల : ₹ 25/-

ముఖచిత్రం : 'జ్యోతి' దీపావళి చిత్రకారుడు : బాపు (1963)



చిరునామా : 1-9-286/2/P; "యడ్లపాటివారి ఇల్లు" ; విద్యానగర్ (రాంనగర్ గుండు దగ్గర); హైదరాబాద్ - 500 044.
ఫోన్ : (ఆ) : 040 - 2707 1500 :: (ఇ) : 040 - 2707 7599
*email : rachanapatrika@hotmail.com, rachanapatrika@gmail.com ; www.rachana.net*



**సంపాదకీయం..... 5**

## కథలు

కథాపీఠం కథ :: మనిషీ!... ఓ మనిషీ!...
- వివిన మూర్తి 21

రుచి - భమిడిపాటి జగన్నాథరావు 29

కథాపీఠం కథ :: కాలి కాటుక
- బి.పి. కరుణాకర్ 33

దానములందు అన్నదానమే వేరయా...!
- 'శాంభవి' 36

కథాపీఠం కథ :: నిర్ణీతి *(పెద్దకథ)*
- పి.ఎస్. నారాయణ 40

ప్రేమాతీతం - యోగానంద్ 56

అమ్మిలి - డా॥ మృదులాంజలి 70

మాజీ మొగుడు - యల్లాప్రగడ 79

పలుకు తేనెల తల్లి పవళించెను
- సిద్దాబత్తుల సుభాషిణి 83

## శీర్షికలు

పజిలింగ్ పజిల్ - 227
నిర్వహణ : సుధామ 8

అమృతవర్షిణి - డా॥ కె.వి. రమణ 20

సాహితీ వైద్యం - వసుంధర 63

రచనాసమీక్ష - పి.వి.ఆర్. 92

## సీరియల్ రచనలు

కుజుడి కోసం
- డాక్టర్ చిత్తర్వు మధు 12

పిల్లకోతి కిచకిచలు
- వై. శేషతల్పశాయి 74

అమెరి'కాకమ్మ'కబుర్లు
- వంగూరి చిట్టెన్ రాజు 95

## అక్కడక్కడక్కడా

కార్టూన్లు


**వచ్చే సంచిక కథకులు .....**

**మంథా భానుమతి : శైలజామిత్ర : కర్రి శివాజి : పాలెపు బుచ్చిరాజు తదితరులు**


The Views, Opinions expressed and Statements made by the Writers, Authors and Readers need not necessarily be those of the Editor and Management of Rachana Entinti Patrika.
All disputes will come under the exclusive jurisdiction of respective Courts and Forums situated in Hyderabad City only.

**సలహాదార్లు**

కాళీపట్నం రామారావు
కవన శర్మ
అత్తలూరి నరసింహారావు
వసుంధర
కోడూరి శ్రీరామమూర్తి
కేతు విశ్వనాథరెడ్డి
డా. ఎన్. సురేంద్ర
వై. రాంబాబు & శాయి
డా. డి.వి.ఆర్. పూషా



**మార్కెటింగ్**

**పచిపాల మార్కెటింగ్**
3-6-136/6, స్ట్రీట్ నెం. 17
హిమయత్‌నగర్,
హైదరాబాద్-29
ఫోన్ : 040 - 40077558
మొబైల్ : 9848630702

*సంపాదకుడు*
**వై.వి.యన్.ఆర్.యన్.తల్పశాయి**

*అసోసియేట్ ఎడిటర్*
'హంసలేఖ'

***The Only Magazine Administered by Writers***




గత సంవత్సరమంతా కొందరు మిత్రులతో కలిసి పడిన ప్రయాస ఫలితంగా 2011 జనవరిలో దాసరి సుబ్రహ్మణ్యంగారి రెండు నవలలూ, ఒక కథాసంపుటి ప్రచురించగలగడం సంతోషాన్నిచ్చింది. కానీ తృప్తిగా లేదు. అసంతృప్తితోనేగదా అలవిగాని పనుల సాధనకు మార్గాలను అన్వేషించేది! ఆ అసంతృప్తికి కారణం లభ్యం కాని ఆయన రచనలు మరెన్నో ఉండడమే! 'చందమామ'లో వచ్చిన సీరియల్స్ ప్రచురించే అవకాశం ఎలాగూ లేదు. కనీసం మిగతా పత్రికల్లో వచ్చిన వాటినన్నా బైటికి తేవాలన్న అభిలాషతో అప్పట్నించీ వాటిని సంపాదించాలనే ప్రయత్నం కొనసాగుతూనే వస్తోంది.

అనుకోకుండా శ్రీ డి.యస్.శంకర్ (వక్కలంక) గారి దగ్గిర 'ప్రమోద'లో ప్రచురింపబడిన 'కపాల దుర్గం' లభించింది. దాన్నందించినందుకు వారికి కృతజ్ఞతలు! 30 నెలల ఈ సీరియల్ 15 భాగాలు వర్ణచిత్రాలతోనూ, మిగిలిన 15 భాగాలూ రెండు రంగుల చిత్రాలతోనూ ప్రచురింపబడింది. మళ్లీ – ఇదివరలో దొరక్కుండాపోయిన ఏడు సీరియల్స్‌లో ఒకటే దొరికిందన్న – అసంతృప్తి! ఇది లభించిన విధానంలోనే మిగతావి కూడా ఎవరి దగ్గరన్నా అజ్ఞాతంగా ఉండిపోయి లభించవచ్చునేమోనన్న ఆశ!

ఇంకా దొరకాల్సిన దాసరిగారి సీరియల్ నవలలు : 'బొమ్మరిల్లు'లోని *'శిధిల నగరం'* (1974–76), *'మంత్రాలదీవి'* (1976–80), *'గంధర్వ నగరం'* (1980–82), *'సర్పకన్య'* (1982–85) ; 'స్నేహబాల'లోని *'మాయాగంధర్వుడు'* (1977) ; "మిలియన్ జోక్స్'లోని *'మాయాద్వీపం'* (1980). ఈ సీరియల్స్‌గానీ, ఇవి పడ్డ ఆయా పత్రికల సంచికలు – కొన్నయినాగానీ – రచనాభిమానులు సంపాదించడానికి ప్రయత్నించగలరని ఆశిస్తున్నాము. దీనికి మార్గాలు : తమ దగ్గిర ఉన్న పాత పుస్తకాల ఖజానాలను వెదికి వెలికి తీయడం – తమ మిత్రుల దగ్గిర దొరుకుతాయేమోనని ప్రయత్నించడం – తమకు అందుబాటులో ఉన్న గ్రంధాలయాల్లో పరిశోధించడం – పాత పుస్తకాలు అమ్మబడేచోట్ల దుర్భిణీ వేసి చూడ్డం మొదలైనవి.

ఈ విషయంలో రచనాభిమానులు తమవంతు కృషి చేసి దాసరి సుబ్రహ్మణ్యంగారి రచనలను అందరికీ అందుబాటులోకి తెచ్చే ప్రయత్నంలో సహకరించగలరన్న ఆశాభావంతో.....

**227**

**ఈ పత్రిక మీది! మీఅభిరుచుల మేరకు పత్రికను రూపొందించడం మా వంతు!! అభిమానించి ఆదరించడం మీ వంతు!!!**

# పుస్తక ప్రియులకు మహదవకాశం

| | కథా సంపుటాలు - సంకలనాలు | రచయిత | | అసలు ధర | తగ్గింపు ధర |
|---|---|---|---|---|---|
| 1. | **రసికరాజ తగువారము కామా?** | వసుంధర | . . . | రు. 72-00 | రు. 60-00 |
| 2. | **నేనూ-చీకటి** (నవల) | కాశీభట్ల వేణుగోపాల్ | . . . | రు. 40-00 | రు. 30-00 |
| 3. | **కాశీభట్ల వేణుగోపాల్ కథలు** | కాశీభట్ల వేణుగోపాల్ | . . . | రు. 50-00 | రు. 40-00 |
| 4. | **కథామహల్ - 2001** | 20 మంది రచయితలు | . . . | రు. 80-00 | రు. 70-00 |
| 5. | **బ్రెయిన్ డ్రెయిన్ (అను) అమెరికా మజిలీ కథలు** | కవన శర్మ | . . . | రు. 75-00 | రు. 60-00 |
| 6. | **కథామహల్ - 2002** | 38 మంది రచయితలు | . . . | రు. 116-00 | రు. 95-00 |
| 7. | **'రచన' కార్టూన్లు** | 79 మంది కార్టూనిస్టులు | . . . | రు. 40-00 | రు. 30-00 |
| 8. | **దిగంతం** *(నవల)* | కాశీభట్ల వేణుగోపాల్ | . . . | రు. 40-00 | రు. 30-00 |
| 9. | **మంచుపూవు** *(నవల)* | కాశీభట్ల వేణుగోపాల్ | . . . | రు. 40-00 | రు. 30-00 |
| 10. | **చిరునవ్వు వెల ఎంత?** *(హాస్య కథలు)* | వసుంధర | . . . | రు. 150-00 | రు. 130-00 |
| 11. | **గణిత విశారద** *(చిన్నపిల్లల నవల)* | అవసరాల రామకృష్ణారావు | . . . | రు. 40-00 | రు. 30-00 |
| 12. | **హంసగీతం** *(చారిత్రాత్మక నవల)* | వివినమూర్తి | . . . | రు. 100-00 | రు. 80-00 |
| 13. | **ఈతరం స్త్రీ** *(నవల)* | అర్నాద్ | . . . | రు. 80-00 | రు. 70-00 |
| 14. | **కథావాహిని - 2003** | 32 మంది రచయితలు | . . . | రు. 100-00 | రు. 80-00 |
| 15. | **తపన** *(నవల) (రెండవ ముద్రణ)* | కాశీభట్ల వేణుగోపాల్ | . . . | రు. 60-00 | రు. 50-00 |
| 16. | **శ్రీరాముని దయచేతను..** *(నవల)* | వసుంధర | . . . | రు. 100-00 | రు. 80-00 |
| 17. | **కథావాహిని - 2004** | 34 మంది రచయితలు | . . . | రు. 100-00 | రు. 80-00 |
| 18. | **పసిడి మనసులు** | జి. జానకీశాస్త్రి | . . . | రు. 50-00 | రు. 40-00 |
| 19. | **కథావాహిని - 2005** | 30 మంది రచయితలు | . . . | రు. 100-00 | రు. 80-00 |
| 20. | **'రచన' అనువాద కథలు** | 30 మంది రచయితలు | . . . | రు. 150-00 | రు. 130-00 |
| 21. | **'రచన' అనువాద నవలలు** | ముగ్గురు రచయితలు | . . . | రు. 150-00 | రు. 130-00 |
| 22. | **సాలెగూడు** www.utopia.com *(నవల)* | డా॥ చిత్తర్వు మధు | . . . | రు. 50-00 | రు. 40-00 |
| 24. | **కథావాహిని - 2006** | 27 మంది రచయితలు | . . . | రు. 100-00 | రు. 80-00 |
| 25. | **కథాప్రహేళిక కథలు** | వివిన మూర్తి | . . . | రు. 100-00 | రు. 80-00 |
| 26. | **ఔనా...!** | డా॥ చిత్తర్వు మధు | . . . | రు. 80-00 | రు. 70-00 |
| 27. | **చంద్ర కార్టూన్లు** | చంద్ర | . . . | రు. 120-00 | రు. 100-00 |
| 28. | **విలువల వెల ఎంత?** | ఎలక్ట్రాన్ | . . . | రు. 150-00 | రు. 130-00 |
| 29. | **ఐసిసియు** *(నవల)* | డా॥ చిత్తర్వు మధు | . . . | రు. 100-00 | రు. 80-00 |
| 30. | **వీరవిక్రమార్కుము** (అను) **బొమ్మలు చెప్పిన కథలు** | పాలెపు బుచ్చిరాజు | . . . | రు. 80-00 | రు.70-00 |
| 31. | **తెలుగు నాటక సాహిత్యం-హాస్యరస పోషణ** | ఎన్. తారక రామారావు | . . . | రు. 150-00 | రు. 130-00 |
| 32. | **కథావాహిని - 2007** | 26 మంది రచయితలు | . . . | రు. 130-00 | రు. 110-00 |
| 33. | **కథావాహిని - 2008** | 24 మంది రచయితలు | . . . | రు. 130-00 | రు. 110-00 |
| 34. | **అందేవ్ కథలు** | అందే గోపాలకృష్ణమూర్తి | . . . | రు. 150-00 | రు. 130-00 |
| 35. | **కథావాహిని - 2009** | 36 మంది రచయితలు | . . . | రు. 150-00 | రు. 130-00 |
| 36. | **మా కుటుంబం** *(హాస్యరచనా తోరణం)* | కవనశర్మ | . . . | రు. 150-00 | రు. 130-00 |
| 37. | **కోతి రాతలు** *(ఇకిలింపుల హాస్య కదంబం)* | కవనశర్మ | . . . | రు. 50-00 | రు. 40-00 |
| 38. | **కథావాహిని - 2010** | 28 మంది రచయితలు | . . . | రు. 150-00 | రు. 130-00 |
| 39. | దాసరి సుబ్రహ్మణ్యం రచనల సెట్ : | | | | |
| | - దాసరి సుబ్రహ్మణ్యం కథలు | 39 కథలు | | | |
| | - అగ్నిమాల *(పిల్లల బొమ్మల జానపద నవల)* | దాసరి సుబ్రహ్మణ్యం | | రు. 390-00 | రు. 360-00 |
| | - మృత్యులోయ *(పిల్లల రంగుల బొమ్మల జానపద నవల)* | దాసరి సుబ్రహ్మణ్యం | | | |
| 40. | మనిషి మరక | అక్కినపల్లి సుబ్బారావు కథలు | . . . | రు. 80-00 | రు. 70-00 |
| 41. | **ది ఎపిడమిక్ - హెచ్‌వైడి వైరస్** *(నవల)* | డా. చిత్తర్వు మధు | . . . | రు. 120-00 | రు. 100-00 |
| 42. | మన ప్రాచీన సాహిత్యం - చరిత్ర | కవనశర్మ & సత్యశారద | . . . | రు. 50-00 | రు. 40-00 |
| 43. | **కథావాహిని - 2011** | 21 మంది రచయితలు | . . . | రు. 120-00 | రు. 100-00 |

A SERVICE ORIENTED INSTITUTION ADMINISTRATED BY Y.V.S.R.S. SAI

మీకు కావలసిన పుస్తకాలను ఉదహరిస్తూ, వాటి ఖరీదుకు సరిపడా సొమ్మును ఎమ్.ఓ/డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా పంపితే, ఖర్చులు భరించి పోస్టులో కోరిన పుస్తకాలు పంపబడగలవు. రిజిష్టర్డు పోస్టులో పొందగోరిన వారు ప్రతి ఒక్క ఆర్డరుకు రూ. 17/- అదనంగా పంపాలి. **V.P.P. పద్ధతి లేదు.** DD to be drawn in favour of "VAHINI BOOK TRUST" payable at "Hyderabad".

వాహిని బుక్ ట్రస్ట్
1.9.286/3 విద్యానగర్, హైదరాబాద్ 500044

కథాపీఠం

# మనిషీ... ఓ మనిషీ...

> మానవత్వానికి భాష నాణెం. మనిషినీ మనిషినీ కలిపేది బొమ్మ. విడదీసేది బొరుసు. - వసుంధర

**నా** కథ రాసిన రచయిత పేరు లక్ష్మీనారాయణ శర్మ. అతనిది ఇండియా. అతను మాటలాడే భాషనీ, కథలు రాసే భాషనీ తెలుగు అంటారు. అందులో వాళ్ల దేశాన్ని భారతదేశం అంటారు. తెలుగు మాటలాడే వాళ్లు ఫ్రెంచిని మాటలాడేవాళ్ల కన్న ఎక్కువ. తెలుగులో సాహిత్యం ఫ్రెంచి కన్న మూడొందల ఏళ్లు పెద్దది. అయినా ఫ్రెంచి వాళ్లకి వచ్చినన్ని సాహిత్య నోబిల్ పురస్కారాలు ప్రపంచంలో మరే భాషకీ రాలేదు. ఇవన్నీ శర్మ తెలుసుకున్నాడు. తెలుగులో శర్మ ఓ నలభైకి పైగా కథలు, మూడు నవలలుట – ప్రచురించాడు.

నన్నతను అయిదుసార్లు చూసాడు.

నేనుండేది మౌంట్ ఫావే అనే గ్రామ పరిసరాలలో. ఇది దక్షిణ ఫ్రాన్సు దేశంలో సముద్రతీరాన ఉన్న మెర్సై అన్న ప్రసిద్ధ రేవు పట్టణానికి వంద కిలోమీటర్ల దూరాన ఉన్న అవెన్యూ అన్న పట్టణపు శివార్లలో ఉంది. రోన్ నది పక్కనే ఉంది మా అవెన్యూ. ప్రపంచ క్రైస్తవ పీఠం 13వ శతాబ్దంలో కొన్ని పరిస్థితులలో రోమా అంటే రోమ్ వదిలి మా అవెన్యూని కేంద్రంగా చేసుకుంది. ఆనాటి కోట, పోప్ నివసించిన భవంతి ఈనాడు పర్యాటక ఆకర్షణలు.

అవెన్యూలో రోన్ నది ఇవతలి ఒడ్డు నించి అవతలి ఒడ్డుకి దాటించే పడవలో నా రచయిత శర్మ నన్ను తొలిసారి చూసాడు. అప్పుడు నేను మా అమ్మనీ, కొడుకునీ తీసుకుని గాలి పోసుకుందుకు ఆవలి ఒడ్డుకి వెళుతున్నాను. మా అమ్మకి నేనేదో చెపుతున్నాను. ఒక్కముక్క అర్థమయే అవకాశం లేదు. నా కొడుకు ఆడుకుంటున్నాడు. వాడు పడవ అంచుకి వెళ్లాడు. శర్మ చటుక్కున లేచి వాడిని పట్టుకున్నాడు. అతనికి చెడు ఉద్దేశ్యం లేదని నాకు తెలుసు. ఆరేళ్ల నా కొడుక్కి తెలియదు. తన స్వాతంత్ర్యాన్ని పాడుచేసినందుకు వాడికి కోపం వచ్చింది. కోపంగా చూసి నాకు ఫిర్యాదు చేసాడు. మరో వైపున ఆడుకోమన్నాను.

అదీ అతని తొలిచూపు.

ఆరోజు రాత్రి బొబ్బిలియుద్ధంతో తెలుగు వాళ్లకి గుర్తుండిపోయిన బుస్సీదొర పుట్టుపూర్వోత్తరాల గురించి ఇంటర్నెట్లో వెదికాడు.

రెండవసారి మౌంట్ ఫావే పార్కులో చూసాడు. అప్పటికి సాయంత్రం ఎనిమిది. ఎండ తీక్షణంగా ఉంది. కొట్లు కట్టేసారు. రోడ్లమీద కారులు తప్ప మనుషులు లేరు. ఆ రెండూ గమనించిన నా రచయిత వచ్చి పార్కులో కూర్చుని తొలొస్తాయ్ నవల 'వార్ అండ్ పీస్' చదువుకుంటున్నాడు. నెపోలియన్ రష్యాపై చేసిన యుద్ధ నేపథ్యంలో మానవ ప్రవర్తన, కర్తృత్వాల మీద చేసిన వ్యాఖ్యానాలను అర్థం చేసుకుంటున్నాడు. నేను ప్రతిరోజు లాగే రెండు బాల్చీలతో వచ్చి పార్కులోని కుళాయి నుంచి నీళ్లు పట్టి బయటనున్న రోడ్ల పక్క మొక్కలకి పోస్తున్నాను.

శర్మ దగ్గరగా వచ్చి నన్ను చూస్తున్నాడు. అతని చూపులో కుతూహలం ఉంది. నాతో సంపర్కం పెట్టుకోవాలన్న ఆశ ఉంది. నువ్వూ నేనూ ఒకటేనని అసందర్భంగా సూచించాలన్న చిరుకాంక్ష తొంగిచూస్తోంది. కొంచెం వంగి నడుస్తున్నాను. వయోభారం. శర్మకీ అటూయిటూగా నా వయసే ఉంటుంది. ఓ బాల్చీ ఇచ్చాను. నవ్వాడు. నవ్వాను. నా ఫ్రెంచిలో నేను మాటలాడుతూనే ఉన్నాను. అతను తన తెలుగులోనైనా మాటలాడటానికి ప్రయత్నించలేదు. ఇంగ్లీషులో ఒకట్రెండు అని ఊరుకున్నాడు. నా బాల్చీ తీసుకుని వెళ్లిపోయాను.

మూడవసారి మౌంట్ ఫావేలోనే మా ఊరి జాతర సందర్భంగా జరిగిన ఓ కళా ప్రదర్శనలో నన్ను చూసాడు. ఇక్కడ నేనొక శిల్పకారిణి భర్తను. ఒకట్రెండు ఇంగ్లీషు ముక్కలు వచ్చును. నాకు భారతదేశం గురించి రెండే రెండు విషయాలు తెలుసు. నా భార్య పేరు సోనియా మండల్. సోనియా పేరు గల ఓ ఐరోపీయ మహిళ అక్కడ ప్రముఖ రాజకీయ నాయకురాలుట. మండల్ అన్న పేరు విని ఒకాయన కోరమండల్ అన్న ప్రాంతం

(మిగతా భాగం పత్రికలో చదవండి)

వివిన మూర్తి

# జ్యోతి పిల్లకోతి కిచకిచలు


'జ్యోతి' ప్రతీ సంచిక ముఖచిత్రమూ ఒకానొక ప్రత్యేకత కలిగి ఉండేది. ఇక దీపావళి ప్రత్యేక సంచిక (1963) మరీ ప్రత్యేకమే! కార్టూన్ల కొలాజ్ కళ్లు తిప్పుకోనీకుండా చేసింది. ఇలా అనేకానేక కార్టూన్లతో ఒక పత్రిక ముఖచిత్రం రావడం అదే ప్రథమం! అదే పద్ధతి ఆ తర్వాతి కాలంలో అలాంటి ముఖచిత్రాలు రావడా నికి ఒరవడి దిద్దింది. దీపావళి (1964) ముఖచిత్రంగా నలుపు –తెలుపుల్లో ఉన్న నటీమణిని ఎంచుకోవ డం సాహసమే! కానీ దాని అలంకరణ అద్భుతంగా భాసిల్లింది. కానీ ఈ ప్రయో గాన్ని చేయడానికి తర్వాతెవరూ సాహ సించలేకపో యేరు.

❖ ❖ ❖

సమాజంలో యువశక్తి శక్తి అపా రం. దాన్ని గుర్తించే కాబోలు కాలేజీ విద్యార్థు లకు చిన్న కథల పోటీ పెట్టేరు – నెల నెలా మూడు బహుమతులతో.

అందుకే ఈ ప్రయోగం సూపర్ హిట్ అయింది. కాలేజీ కుర్రకారు పడీ పడీ వచ్చే సంచిక కోసం ఎదురు చూసేవాళ్ళు – ఈ నెల ఏ కాలేజీ వాళ్ళకు బహుమతు లొచ్చాయోనని. ఇంటర్ యూనివర్సిటీ ఆటల పోటీల కున్నంత క్రేజు ఉండేది.

డిగ్రీ చేస్తున్న నేను ఆ పోటీలో పాల్గొ నడం, బహుమతి పొందడం ఓ గొప్ప అయితే, "ఇలా మీ కథ 'విశాల'కి ప్రైజ్ ఇచ్చామోచ్" అంటూ 'జ్యోతి' వారు ఉత్త రం రాయడం ఓ తీపిగుర్తు. ఇప్పుడ లాంటి సత్‌సంప్రదాయం ఎందరు సంపాదకులు పాటిస్తున్నారన్నది ప్రశ్నార్థ కమే!


JYOTI
ILLUSTRATED TELUGU MONTHLY
Buckinghampet P. O., VIJAYAWADA-2

Passport Size

10/1/66

MEMBERS

ఆ కథ ఫిబ్రవరి, 1962 సంచికలో ప్రచురింపబడింది.

ఆ నెల బహుమతి పొందిన కథల

గురించి సంపాదకుల 'తొలిమాట'లో ప్రత్యేక ప్రస్తావన ఉండడం విశేషం!

మొదటి బహుమతి పొందిన 'కొత్తిమీర కట్ట' *(పి.భవానీ వరప్రసాద్, మెడికో (2వ సం॥ - ఎ ఎమ్ సి - విశాఖపట్నం);* మూడవ బహుమతి పొందిన 'చింతతోపు' *(అబ్బూరి విశ్వేశ్వరరావు. ఆర్ ఇ సి - వరంగల్)* కూడా చాలా చాలా బావున్నాయి. అ ఇద్దరు కథకులూ ఇప్పుడెక్కడ ఉన్నారో...!

సుచిత్ర మాసపత్రిక

బకింగ్‌హామ్‌పేట పోస్టు

విజయవాడ—2.

*విడిప్రతి వెల*

*75 పైసలు*

*ఏడాది చందా*

*9 రూపాయలు*

సంపుటి 4

ఫిబ్రవరి 1966

సంచిక 2

మేనేజింగ్ ఎడిటర్

వి. వి. రాఘవయ్య

ఆర్ట్ ఎడిటర్

బాపు

సంపాదకవర్గం

నండూరి

రామమోహనరావు

ముళ్ళపూడి

వెంకట రమణ

వి. ఎ. కె. రంగారావు

## తొలిమాట

జ్యోతి అభిమానులకు ఒక శుభ వార్త—కాదు రెండు.

అవి రెండూ కొత్త సంవత్సరంలో మేము తలపెట్టిన కొత్త ఉద్యమాలు. మొదటిది — పిల్లల కోసం ఒక మాసపత్రిక. రెండవది— ఒక సచిత్ర వార పత్రిక. రెండిటికీ విలక్షణమైన రూపురేఖలు దిద్దాలని మా ప్రయత్నం. సాధ్యమైనంత త్వరలో వాటిని ప్రారంభించాలని మా ఆశయం.

• • •

వచ్చే జ్యోతినుంచి బొమ్మాబొరుసు అనే కొత్త శీర్షిక వెలుగుతుంది.

• • •

జ్యోతిలో సాధారణంగా రాయని భాస్కరుడు ఈసారి ఓ గిరీశం లెక్చరిచ్చారు (105). అడ్డం తిరిగిన తెలుగు నాటకాల కథకు ఇది నాందీ ప్రస్తావన.

• • •

ఈసారి చిన్న చిన్న కథల పోటీ ఫలితాలు (17–20–22) మామటుకు మాకు చాలా తృప్తికరంగా వున్నాయి. నేటి విద్యార్థులే భావి రచయితలన్నారు మరి.

ముఖచిత్రం — అన్నపూర్ణావారి "ఆత్మగౌరవం"లో నాగేశ్వరరావు (మార్పు తేవలసిన మనిషి), కాంచన.

ఇప్పుడు చదివినా ఈ కథల పోటీలలో బహుమతులు పొందిన కథలు చాలావరకూ మంచి స్థాయి కలవి కావడం విశేషం! వీటన్నింటినీ కలిపి ఒక సంకలనంగా వెలువరిస్తే బాగుంటుందన్న ఆలోచన చాలా కాలంగా ఉంది. అయితే ఆ కథకులందర్నీ ఇప్పుడు దొరకబుచ్చుకోవడం ఎలా అన్నదే శేషప్రశ్న!

పోతే ఈ చిన్నకథ 'విశాల' వెనకో పిట్ట కథ కూడా ఉంది.

1972లో శ్రీహరికోటలో ఉద్యోగరీత్యా సూళ్లూరుపేటలో ఉంటున్న కాలం. అప్పటికి శ్రీహరికోట ఇంకా శైశవదశలో ఉన్న కారణంగా ఆఫీసు, ఇల్లూ కూడా సూళ్లూరుపేటలోనే ఉండేవి.

అప్పటి ఆ పెద్ద గ్రామంలో రెండు సినిమా హాళ్లుండేవి - వారానికో సినిమా మారిపోయేది. అదే అక్కడ కాలక్షేపం!

అప్పుడో వారం 1971లో విడుదలయిన 'ఇల్లు - ఇల్లాలు' సినిమా ప్రదర్శింపబడగా చూడ్డం జరిగింది. దానిలో రాజబాబు, రమాప్రభల మీద శోభనం గదిలో తీసిన ఓ పాట యమా హిట్టయింది. అది రాసింది కొడకంట్ల అప్పలాచార్య. ఈ చిన్న కథే ఆ పాటగా రూపాంతరం చెందింది.

ఇలా జరగడం చాలా ఆనందాన్నే కలిగించిందా రోజుల్లో. ఈ విషయాన్నిప్పటికీ కొందరు మిత్రులు గుర్తుచేసుకుని చెబుతూ ఉంటారు. అది వేరే సంగతి!

*(మరికొన్ని కిచకిచలు వచ్చే సంచికలో)*

# విశాల



"మనకు విశాల దృక్పథం కావాలి" అన్నాడు విశ్వనాథం.


విశాల మౌనంగా వింటున్నది.

విశాల, విశ్వనాథంల దాంపత్యానికి వయస్సు నెల నిండ లేదు. పెళ్ళైన తరువాత హనీమూన్‌కు నైనిటాల్ వచ్చారు.

వాళ్ళిద్దరూ, పగలంతా అటూ యిటూ తిరిగి తిరిగి హోటలో రూమ్‌లో విశ్రాంతి తీసుకుంటున్నారు.

"నేను దంపతుల మనస్తత్వాల గురించి, ప్రత్యేకంగా ఒక గ్రంథం వ్రాయాలనుకుంటున్నాను. దానికి నీ సహాయం కావాలి నాకు" అన్నాడు విశ్వనాథం.

అతను మనస్తత్వ శాస్త్రంలో డాక్టరు. డాక్టరేట్ లభించిన వెంటనే వివాహం చేసుకున్నాడు.



ద్వితీయ బహుమతి రూ. 25

వై. శేషతల్పశాయి

బి. ఎస్. సి (ఫైనల్)

న్యూ సైన్సు కాలేజీ, హైద్రాబాద్

"నా సహాయమా?" అంది విశాల.

"అవును విశాలా! గ్రంథ రచనకు ముందు మన యిద్దరి జీవితాలపైనే పరిశోధన సాగించాలనుకుంటున్నాను. దానికి నీ సహాయం చాలా అవసరం. మనమధ్య రహస్యాలనేవి ఉండగూడదు. మన గత జీవితంలోని ముఖ్యవిషయాలు ఒకరికొకరు చెప్పుకొందాం. సహృదయంతో సరిగ్గా మనం అర్థం చేసుకుని కలసిమెలసి జీవనయాత్ర సాగించాలి. మన జీవితంలో అభిప్రాయ భేదాలకే తావుండకూడదు" అన్నాడు విశ్వనాథం.

"అయితే, ముందు మీరే చెప్పండి. తరువాత నేను కూడా చెబుతాను" – జవాబిచ్చింది విశాల.

విశ్వనాథం చెప్పడం ప్రారంభించాడు.

"నేను కాలేజీలో చదివే రోజులలో శకుంతలతో నాకు పరిచయమైంది. ఎట్లా పరిచయ మైందో నాకు గుర్తులేదు. చాలా చిత్రంగా మేము దగ్గరైపోయాం. ఇంటర్మీడియట్ తరువాత ఆమె మెడిసన్ చదివేందుకు ఆ ఊరు విడిచి పెట్టింది. ఆ క్షణం నించి ఒకటి రెండు నెలలు నేను పడ్డ వ్యధ వర్ణించలేను. కనీసం నాతో తన ప్రయాణాన్ని గురించి కూడా చెప్పకుండా, నిర్దాక్షిణ్యంగా నన్ను విడిచి వెళ్ళిపో యింది. ఇప్పుడు శకుంతల ఏమైందో నాకు తెలీదు. ఆ మధ్య ఎవరో అన్నారు – ఆమె చచ్చిపోయిందని. నవ్వుకుని,

ఇల్లు - ఇల్లాలు (౧౯౭౧)

వినరా సూరమ్మ కూతురు మొగుడా,

విషయమ్ము చెబుతాను,

అసలు విషయము చెబుతాను

**చెప్పుమరీ!**

కారుమబ్బులు కమిన్మవేళ,

కాకులు గూటికి చేరేవేళ;

చందమామ తొంగి చూసేవేళ,

సన్నజాజులు పూసేవేళ;

ఒంటిగ నేను యింట్లో వుంటే,

ఉయ్యాల ఎక్కి వూగుతువుంటే:

**ఏం జరిగింది?**

తలుపు కిర్రున చప్పుడైనది.

గుండె ఝల్లున కొట్టుకున్నది.

మెల్లమెల్లగా కళ్ళుతెరచి: నేవచ్చిన దెవరో చూశాను!

**ఎవలాలు?**

నల్లనివాడు, గుంటకన్నులవాడు; గుబురు మీసాలవాడు;

**అయ్యబాబోయ్**

ఆరడుగుల పొడుగువాడు: ముద్దులిమ్మని నన్ను అడిగినాడు

**ఏయ్, వాణ్ణి నేన్నరికేత్తాను!**

నేనివ్వ, నేనివ్వ, రానివ్వనంటూ మొగము దాచుకున్నా

పోనివ్వ, పోనివ్వ, ముద్దివ్వమంటూ జడను లాగినాడూ

అమ్మా! నాన్నా! కాపాడమంటూ: అల్లాడిపోయానూ....

అయినాకాని, వదలక, నన్ను ఒడిసి పట్టినాడు

**అంతలో వచ్చింది...**

**ఏమిటి, మూల్పా?**

**కాదు! మా అమ్మ!**

**ఏమందీ?**

వెళ్ళవే నాతల్లి, వెళ్ళవే అమ్మా.

ముద్దులిస్తే నీకు డబ్బులిస్తాడు,

మంచి బట్టలిస్తాడు! **అని: ముందుకు తోసింది.**

**ఆఁ ? అది తల్లా! కాదు; లాక్షసి, పిచాచి !?**

**దయ్యం!! తల్వాతేమయిందో చెప్పు**

తప్పని సరియై వెళ్ళాను. సిగ్గుపడుతూ నిలుచున్నాను.

**ఆఁ !?**

గదిలో కెత్తుకు పోయాడు. కథలూ కబుర్లూ చెప్పాడు.

తన దుప్పటిలో చోటిచ్చాడు.... ....

**ఛీ, కులతా! పాపాత్ములాలా! నువ్వు నాకొద్దు!!**

**పో, వాడిదగ్గలకే పో!**

అంతకోపం ఎందుకయ్యా,

అప్పుడు నావయ సై దయ్యా.


**ఏమిటీ, అపుడు నీకైదేళ్ళా!**

ఆ వచ్చినది మా తాతయ్య.

**తాతయ్యా? మలి చెప్పవేఁ ? తాతయ్యా? నేను ఎవలో అనుకున్నాను. తాతయ్య కొంపముంచేచాడు!....**



చిత్రం : ఇల్లు - ఇల్లాలు (౧౯౭౧) లో రమాప్రభ - రాజ్‌బాబు :: గీతరచన : కె. అప్పలాచార్య :: సంగీతం : కె.వి. మహాదేవన్ :: గాయని : యస్. జానకి మధ్యమధ్యలో ఆక్రోశించింది : రాజ్‌బాబు




అనుకున్నాను – నేను చాలా అదృష్టవంతుడనని...ఆమెకు మరీ దగ్గర కానందుకూ, నిన్ను పెళ్ళి చేసుకున్నందుకూ”

ముగించాడు విశ్వనాథం.

ఆమె తనలో తను నవ్వుకుంది.

“మరి....నువ్వు....చెప్పు....” అన్నాడు విశ్వనాథం.

విశాల మెల్లిగా మొదలు పెట్టింది.

“ఎంతో అందంగా ఉండేవారాయన...”

కాసేపు ఆగింది విశాల.

విశ్వనాథం అన్నాడు – “చెప్పు విశాలా! నేనేం పరాయివాడినా? నీవు చెప్పేదంతా మంచి మనసుతో అర్థం చేసుకుంటా”

విశాల చెప్పసాగింది –

“ఆయనకు నేనంటే ఎంతో అభిమానం, ప్రేమానూ. ఒక్క గంటసేపైనా నన్ను వదలి వుండలేకపోయేవారు. నాకూ అట్లానే ఉండేది. రోజూ నా కోసం పండ్లూ, పూలూ తెచ్చేవారు. సాయంకాలం పూట బజారుకో, బీచ్‌కో తీసుకు వెడుతూండేవారు. ఆయన నన్ను కౌగలించుకుని, ప్రేమగా మాట్లాడుతూ ఉంటే నాకెంతో సంతోషంగా ఉండేది” – ఇంకా చెబుతూనే ఉంది.

విశ్వనాథం ఛాతీ ఉప్పొంగుతోంది. కళ్ళు ఎఱ్ఱబడసాగాయి. వేడిగాలి ముక్కుపుటాల నుండి వెలువడుతోంది.

విశాల ఈ లక్షణాలనన్నీ గమనించి కూడా చెప్పడం ఆపలేదు.

“ఒకసారి ఆయనను విడిచి పది రోజులుండవలసి వచ్చింది. అప్పుడు నేనెంత బాధపడ్డానో! రోజూ కలలూ, కలవరింతలూను. పది రోజుల తరువాత తిరిగివచ్చి, ఆయన కూడా అదేమాట అన్నారు....”

“విశాలా!” – అరిచాడు విశ్వనాథం.

విశాల ఆపుజేసింది.

“నువ్వు నన్ను మోసం చేశావు. ఎవరికో మనసిచ్చి నన్ను పెళ్ళిచేసుకున్నావు. నిన్ను.... నిన్ను ఏం చేసినా పాపం లేదు.....” – మాటలు రావడం లేదతనికి.

ఆమె మాట్లాడలేదు.

మనస్తత్వ శాస్త్రంలో డాక్టరేట్ పొందిన అతని అభిప్రాయ వైపరీత్యానికి లోలోపల నవ్వుకుని,

“మీరు నన్ను పూర్తిగా చెప్పనివ్వడంలేదు. జీవితంలో ప్రేమ గొడవలూ, ప్రియుల గొడవలూ తప్ప మరి దేనికీ ప్రాముఖ్యం లేదా? డియర్ డాక్టర్! నన్ను తన ప్రాణం కంటే అధికంగా అభిమానించి, అనురాగం అందించిన ఆయన మరెవ్వరో కాదు – మా తాతయ్య! ఆయన యిప్పుడు లేరు – కారు యాక్సిడెంట్‌లో పోయారు” అన్నది విశాల.

❖




25-10-1922న జన్మించి 27-1-2010న మరణించిన ఓ అద్భుత తెలుగు సాహిత్యకారుడు దాసరి సుబ్రహ్మణ్యం. ఏ కొద్ది మందికో తప్ప తెలియని, ఏ విధమైన ప్రాచుర్యానికి ప్రయత్నించని అజ్ఞాత సాహిత్య బ్రహ్మ. టి.శంభుదాసు, డి.భవానీప్రసాద్, సుజాత, దాసు, డి.సుబ్రహ్మణ్యం - యింకా అనేకమైన కలంపేర్లతో సాహిత్య సృష్టి చేసిన మహామనిషి. ఆద్యంతమూ నిరాడంబరమైన జీవితాన్ని గడుపుతూ అజ్ఞాతంగానే అస్తమించిన తెలుగు సాహిత్య రత్నం.

ఎవరీ దాసరి సుబ్రహ్మణ్యం? 1954-1980ల మధ్య 'చందమామ' పిల్లల మాసపత్రికలో 'తోకచుక్క' మొదలు 'భల్లూక మాంత్రికుడు' వరకూ 12 జానపద, మంత్రతంత్ర ధారావాహికలను, మరో అజ్ఞాత సంస్థాన చిత్రకారుడు 'చిత్ర' (కీ.శే. టి.వి.రాఘవులు)తో కలిసి పత్రికను తీర్చిదిద్దడంలో ప్రధాన పాత్ర వహించారు. దాసరి వారికి 'చందమామ'తో 54 ఏళ్ళఅనుబంధం. రాఘవులు గారికి 'చందమామ'తో మూడు దశాబ్దాల పై చిలుకు అనుబంధం. వీరిరువురూ 'చందమామ' సంచాలకుడు కీ.శే.చక్రపాణిగారి కలలకు అక్షర రూపమిచ్చిన చిత్రాక్షర మాంత్రికులు. అనేకమైన భారతీయ భాషల్లో వెలువడిన 'చందమామ' ద్వారా చిన్నా పెద్దా తారతమ్యం లేకుండా లక్షలాది పాఠకుల్ని అలరించిన ఘనతలో వీరి పాత్ర అగ్రతాంబూలాన్నందుకొంటుంది.

వ్యాపారపరమైన ఏ విధమైన హంగులూ, ఆర్భాటాలు లేకుండా చక్కటి కథలతో 'రచన' మాసపత్రికను వెలువరిస్తున్న 'శాయిగారు' అప్పుడప్పుడూ కొన్ని మొండివైనా మంచి పనులకు శ్రీకారం చుడ్తారు. అటువంటి ప్రయత్నమే ఏప్రిల్, మే 2010 సంచికలను సంయుక్తంగా ముద్రించి, ఆ విశేష సంచికనంతటినీ దాసరి సుబ్రహ్మణ్యం, చిత్రాగార్ల జీవిత విశేషాలతో నింపి, జానపద నవలా సమ్రాట్ దాసరి సుబ్రహ్మణ్యం స్మృతి సంచికగా వెలువరించారు. 'చందమామ', 'బొమ్మరిల్లు' పత్రికల విజయసారథుల్లో ఒకరైన దాసరి సుబ్రహ్మణ్యంగారెవరో ఆయన మరణానంతరం అశేష ఆంధ్ర ప్రజానీకానికి తెలిసిందనడంలో అతిశయోక్తి లేదు. 'కించిత్ భోగే భవిష్యతి' చందాన శాయిగారు ఓ మహామనిషికి ఘనమైన నివాళు లర్పించారు. అంతేకాకుండా 'బొమ్మరిల్లు'లో ధారావాహికంగా వచ్చిన 'మృత్యులోయ', 'యువ'లో వచ్చిన 'అగ్నిమాల' సచిత్ర నవలల్ని శాయిగారి ఆధ్వర్యంలో ఉన్న వాహినీ బుక్ ట్రస్ట్ 'మంచి పుస్తకం' అనే సంస్థతో కలిసి సంయుక్తంగా ప్రచురించింది. అభిమానుల అండదండలతో వాహినీ బుక్ ట్రస్ట్ తరఫున సుబ్రహ్మణ్యంగారు రాసిన 39 కథలను 'దాసరి సుబ్రహ్మణ్యం కథలు' సంపుటిగా తీసుకురావడం జరిగింది.

39 కథలని ప్రయాసపడి సేకరించి, ప్రచురించిన 'రచన' శాయిగారి తొలిపలుకు, విశ్లేషిస్తూ వసుంధరగారి మలిపలుకు, 1955లో - అంటే 55 ఏళ్ళ క్రితం - కొడవటిగంటి కుటుంబరావు గారు రాసిన సుబ్రహ్మణ్యంగారి కథలని గురించిన పీఠిక, 1971లో పుస్తక ప్రచురణలోని సాధక బాధకాలను గురించి కుటుంబరావుగారి ప్రస్తావన, కథల తర్వాత చివరి పేజీల్లో సుబ్రహ్మణ్యంగారి జీవన సరళిపై శ్రీ కె. రాజశేఖరరాజు రాసిన వ్యాసం, చిత్రకారుడు 'చంద్ర' గీసిన సుబ్రహ్మణ్యంగారి వర్ణచిత్రాలతో ఈ కథాసంపుటి మరింత ప్రాధాన్యతని సంతరించుకొంది.

కథల్లోని వాడిని, నాడిని పట్టుకోవడంలో ప్రసిద్ధుడైన 'రచన' శాయిగారి తొలిపలుకుల్లో ఆయన వ్యక్తపరిచిన అభిప్రాయాల్ని యిక్కడ యథాతథంగా తెలియజేయడం సముచితమనిపిస్తుంది. కథల్ని గురించి శాయిగారి విశ్లేషణ -

*"తప్పుల్ని ఒప్పులు చేసుకొన్న లౌక్యులూ-జీవితాల్ని సంక్లిష్టం చేసుకొన్న అలౌక్యులూ-సినీమాయలో నాశనమైన పేరాశలూ-భక్తిని దోపిడీచేసే భగవదంశలూ-మగవారి దౌష్ట్యానికి బలైన మగువలూ-తమకు తాముగా బలైన తరుణులూ-ఆదర్శమూర్తులైన త్యాగరాణులూ-నాతిచరామికై నరకానికి సై అనే నారీమణులూ-మహిళాభ్యుదయంలో భంగపాటు చవిచూసిన మహారచయితలూ-మహిళా విమోచనంలో తిరోగమించిన మహాకథకులూ-అందాన్ని నిర్వచించిన అనాకారులూ-దెయ్యత్వంలో మానవత్వాలూ- పురాణ పురుషుల లీలామానుష విచిత్ర విన్యాసాలూ-మూఢభక్తితో అమాయకుల బలిపీఠాలూ- కులవిచక్షణపై మామూలు గృహిణుల సంకుల సమరాలూ-ఈ కథాసంపుటిలో తారసపడి మనసుల్ని ఉక్కిరిబిక్కిరి చేసి ఆలోచింపచేస్తాయి. విలక్షణ కథాంశాలు, సులభగ్రాహ్యమైన శైలి, అసాధారణ శిల్పం! సజావుగా సజీవమైన పాత్రలు! అసభ్యతకూ, అశ్లీలతకీ తావులేని స్త్రీపురుష సంబంధాల తావికి గుబాళింపు! వెరశి స్త్రీజాతి ఔన్నత్యానికి పెద్దపీట వేస్తూ జీవితపు పలు పార్శ్వాలను తడిమి మనసులను చెమ్మగిలలి చేసే కథలివి!"*

ఊహాతీతమైన జానపద సాహిత్యాన్ని సృష్టించిన సుబ్రహ్మణ్యం గారి కలం నుంచి జాలువారిన ఈ కథలు 'సామాజిక స్పృహలేని కథలు కథలు కావన్నవారికి కావల్సినంత సంతృప్తిని కలిగిస్తాయి. ఈనాడు వస్తున్న కథలతో పోలిస్తే, చెప్పి ఒప్పించే నైపుణ్యం సుబ్రహ్మ


ణ్యంగారి సొత్తనిపిస్తుంది. సంఘటల్ని కథగా చెప్పడం చాలామందికి సాధ్యమే అయినా, పాత్రల మనోభావాల్ని, చుట్టూ ఉన్న పరిసరాల్నీ కథలో మేళవిస్తూ, కథాప్రవాహం ఆగకుండా, పాఠకుల దృష్టి చెదర కుండా కథని చెప్పడంలో సుబ్రహ్మణ్యంగారి నైపుణ్యం గోచరిస్తుంది.

దాసరిగారి తత్త్వం, ఆలోచనలూ కథలు చదువుతూంటే స్పష్టంగా అర్థమౌతాయి. *'పాడులోకానికి అంతస్సును చూసేశక్తి నశించింది. అంతా బాహ్య చిహ్నాలు–వాటికే గౌరవం!'* – 'తుమ్మల్లో అస్తమయం' అనే మొదటి కథలో దాసరి వారి ఈ ప్రారంభ వాక్యాలు నేటి సమాజ స్వరూపాన్ని నిర్వచిస్తాయి.

పురుషుడి ఆలోచనలలో స్త్రీ యిలా మెదుల్తుంది. *'ఆమె అన్నది నిజం. తను అందంగా వుంటానని తగు జాగత్తలు తీసుకోకపోతే ఆమె ఎలా ప్రేమించగలుగుతుంది? ఒకసారి ప్రేమించి పెళ్ళి చేసు కొన్నతర్వాత మొగుడు ఎలాంటి అందవికారాన్ని ఏ ఆదర్శం కోసం పొందినా సహించి ఉరుకోవటానికి ఈమె చచ్చిన నవలల్లో స్త్రీ కాదాయె!'* – జీవిత భాగస్వాములవిషయంలో ఆందానికున్న ప్రాము ఖ్యత పైకి ఒప్పుకొన్నా లేకపోయినా అంతరాంతరాలలో దాగిన సత్యమిది. 'తెరవబడని తలుపు' అనే కథలో యిలాంటి మనస్తత్వ చిత్రణ వాద్దవాల్ని తెలిజేస్తుంది.

స్త్రీ పురుషుల అంతరాంతరాలలో చెలరేగే కామప్రకోపాలు చేయ రాని పనులను చేయిస్తాయి. వివాహప్రసక్తి లేని ఈ సంబంధాలకి జాతి, మత, కుల బేధాలు అడ్డురావు. మోజు తీరిన తర్వాత రాజా రావు ఉంచుకొన్న ఉంపుడుకత్తెను మరో కులీనుడు చేరదీసి, ఆ రాజావారికి తిరిగి మనసు కలిగి వచ్చిన రాత్రి ఆ కులీనుడు యింటికి పరుగెట్టాడు. యింటికి కాపలాగా ఉంచిన ఓ చెప్పులు కుట్టే కుర్రాడితో తనభార్య ఉడాయించిన సంగతి గ్రహిస్తాడు. మైల సోకితే గోమూత్రం చల్లితే దోషనివారణ జరుగుతుందన్న భర్త మాటలు చెవికెక్కిన భర్య ఓ చెంబునిండా గోమూత్రం ఉంచి వెళ్తుంది, 'లౌకికుడు' అనే కథలో.

ఏ స్థాయికాస్థాయిలో కులవివక్షలు కొనసాగే సమాజం మనది. యికముందు దొంగతనం చేయనని వాగ్దానం చేయించుకొని, ఓ నిమ్నకులస్థుడైన దొంగతో ఓ హెటల్లో పనిచేసే యానాది స్త్రీ, భర్తని వదిలి లేచిపోతుంది. ఏడో నెల గర్భంతో ఉన్నప్పుడు పోలీసుల కంటబడకుండా ప్రియుడు దాచిన దొంగసొత్తుని తీసుకురమ్మనీ, ముక్కుపుడక చేయించమనీ బలవంతం చేస్తుంది. అతగాడు పాము కాటుకు గురౌతాడు. మరణభయంతో జ్ఞానోదయమై, మెలికలు తిరుగుతోనే, ముందు తాను దొంగిలించిన సొమ్ము ఎక్కడ దాచిందీ చెప్పి, ఆమెను తన భర్త దగ్గరకు వెళ్ళిపొమ్మనీ, కడుపులోఉన్న తన శిశువును జాగ్రత్తగా చూసుకోమనీ అర్థిస్తాడు. ఆమె భర్త దగ్గరకు వెళ్ళదుకాని పాము కాటుకి మంత్రం వేసే సత్తెయ్య వెనక పరుగు తీసి తన దేముణ్ణి రక్షించమని గోల పెడ్తుంది. మనుషుల మనస్త త్త్వంలో, ప్రవర్తనల్లో వచ్చే మార్పులను సూచించే కథ 'దొంగసొత్తు'.




## దాసరి సుబ్రహ్మణ్యం కథలు

రచయిత : దాసరి సుబ్రహ్మణ్యం :: ప్రచురణ : వాహినీ బుక్ ట్రస్ట్, 1-9-286/3, విద్యానగర్, హైదరాబాద్ – 500 044 : (పేజీలు : 316 ; మూల్యం : రూ.180/– : కానీ విడిగా అలభ్యం!). **రు. 360/–**కి ఈ కథాసంపుటితో పాటుగా రెండు పిల్లల జానపద సీరియల్ నవలలు 'మృత్యులోయ : అగ్నిమాల' కలిపి లభ్యం!

అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో కూడా లభించును.

'యిది నా చరితము' అంటూ ఓ స్వాములారి జీవితచరిత్రతో తన చరిత్రను ముడిపెట్టి ఓ భక్తుడు రాసిన కథనం. కాస్తంత హాస్యధోరణిలో సాగిన ఈ రచనలో దాసుగారేమంటారో చూద్దాం.

*"చిన్నప్పట్నుంచీ నాకు దేవుడి మీద, యిప్పటి లాగానే అతి భక్తి విశ్వాసాలు ఉన్నై. హేతుతర్కవాదాలూ, యింగిత జ్ఞానం అనబడే వన్నీ అసుర పకృతి లక్షణాలనీ, అసలు మానవుడు కష్టాలు పాలవ డం మొదలు పెట్టింది యిలాంటివి తెలుసుకొన్న తర్వాతనేననీ నా నమ్మకం. పరంజ్యోతిలో విలీనం కావాలంటే సంశయం, అనుమా*

నం లేని ప్రశ్నారాహిత్యమైన గుడ్డి, మూఢభక్తి మాత్రమే మనం అలవర్చుకోవాలనీ నా అభిప్రాయం. హేతువాదికీ, తర్కసిద్ధాంతికీ, యింగిత లౌకిక జ్ఞానాలతో కృంగిపోయేవాడికి భగవద్దర్శనం ఎన్నటికీ సాధ్యంకాదు!" – హేతువాదంతో పాపచింతన లేకుండా ధనార్జనచేస్తూనే, అంతర్లీనమైన పాపభయంతో దేవాలయాల హుండీలను నింపే ద్వంద్వానికి దాసుగారి చురక యిది.

'యౌవనంలో వున్న మానవుల ప్రాణాలకి, ప్రాణాంతకంగా పరిణమించే సమస్యలు యీ ప్రపంచంలో రెండే రెండు అందంగల ఆడదీ, డబ్బుగల మొగాడూ!' అంటూ ఓ ఎత్తుగడతో మొదలైన కథ 'హంసపాదు'. యిలాంటి పునాదుల మీద అనుగుణంగా కథ రాయడం క్లిష్టమే అయినా దాసరిగారు అలవోకగా కథని అల్లేస్తారు. యిలాగే 'అగ్నిపరీక్ష' అనే కథని 'దేవుడంటే భక్తిలేకపోయినా, దయ్యమంటే చాలామందికి భయం ఉంటుంది. దేవుడు కరుణా మయుడు, ఎవర్నీ గురించీ అంతగా పట్టించుకోడు. కాని దయ్యాలు అలా కాదాయె?' అంటూ ఆరంభిస్తారు. 'కాని, కామేశానికి మాత్రం ఈ భక్తీ భయం కూడా ఏనాడూ దగ్గరకు చేరలేదు. యిందుకు కారణం అతడు దేవాలయం పక్కనే ఉన్న పూరిపాకలో పుట్టడం, దయ్యాల మర్రి కింద పెరిగి పెద్దవాడవడం కావొచ్చు' అని మలి వాక్యాలు రాస్తారు. నిత్యపరిసరాల ప్రభావం మనుషుల మీద ఎలా ఉంటుందో చెప్పడానికి ఈ వాక్యాలు చాలు. సమగ్రమైన భావాల్ని క్లుప్తంగా చెప్పడంవల్ల కథనం పరుగులు తీస్తుంది.

1949 'తెలుగు స్వతంత్ర'లో ప్రచురితమైన 'అవ్యక్తం' అనే కథ ఆ నాటికే మారుతున్న సమాజనైజం వ్యక్తం చేస్తుంది. అందు లోని ముగింపు ఈ విధంగా కొనసాగుతుంది.

"భారతదేశంలో వున్న మహారణ్యాలన్నీ ఒకేసారి ముట్టుకొని, బ్రహ్మాండమైన మంటలతో, పొగలతో తగలబడిపోతున్నై. ఆ మండే అగ్నిలో చిక్కుకొని పెద్దపులులూ, సింహాలూ, తోడేళ్ళూ, గుంట నక్కలూ, ఋషులూ అందరూ, అన్నీ మాడి బూడిదైపోతున్నై. చుట్టూ లక్షల కోట్లల్లో చేరిన ప్రజానీకం 'పండించేందుకు పొలాలు! ఇళ్ళు కట్టుకొనేందుకు స్థలాలు!' అంటూ ఉత్సాహంతో కేకలు వేస్తున్నారు. –'దేవా! భారతదేశం ఆధ్యాత్మిక శక్తిని కోల్పోతోంది. మానవుడు నిన్ను సాధించేందుకు ఏ నిర్జనారణ్యానికి వెళ్ళి తపస్సు చేసుకుంటాడు? వున్నావా? వుంటే చూస్తూ ఊరుకున్నావా? అంతా మోసం!" – పర్యావరణం ధ్వంసమౌతున్న తీరుని గురించి ఆనాడే దాసుగారి ఆవేదన ఇది!

వాక్యాలతో ఆడుకొని చివరకు ఒక్కమాటలో తేల్చి చెప్పే చమక్కులు దాసరిగారి కిష్టంలా కనబడ్తుంది. కే.కే.దాస్ అన్న మారు/కలంపేరుతో రాసిన 'గెలుపు' అన్న కథలో ఆయన సాము చూడండి.

"గోల్కొండ కోట బురుజు మీద చంద్రవంక పతాక రెపరెప లాడింది. ఉదయ సూర్యుడి రక్తకిరణాలు కోట గోడలకు నెత్తురు పులుముతున్నాయి. కోటలో తానీషాగారు అప్పుడే ఉదయదాశక్తత (మార్నింగ్ హేంగోవర్) పోయేటందుకు మొదటి మధిర పాత్ర... అంటే పాత్రామాత్ర మధువును సేవించారు. కోటలో అరబ్బీ గుర్రం హేషించింది. గోడ పక్కనే గదిలోంచి ఓ గాడిద గోండ్రించింది. ప్రభాతం శూకపికశారికాకీరకాది... ఎందుకొచ్చిన బాధకాని ఒక్కమాటలో భళ్ళున తెల్లవారింది, తానీషాగారి రాజ్యంలో!" – వర్ణనల మీద దాసుగారు విసిరిన గులాబిలాంటి వ్యంగ్యం!

నిర్మాణాత్మకమైన విశ్లేషణలు, పరిచయాలు, విమర్శలు చేసే వసుంధరగారి మలిపలుకులు, కథాసంపుటులను వెలువరించాల్సిన అవసరాల్నీ, ప్రచురణలో రచయితలు ఎదుర్కొనే సమస్యల్నీ గురించి కొడవటిగంటి కుటుంబరావుగారి ప్రస్తావనా, సుబ్రహ్మణ్యంగారి కలం నుంచి జాలువారిన వైవిధ్యమైన, విలక్షణమైన యితివృత్తాలు, వాటికి తగ్గ ప్రవాహరీతి అలవోక కథనాలు ఈ సంపుటి ప్రత్యేకత! ఈనాటి రచయితలందరూ అధ్యయనం చేయవలసిన పుస్తకం. ముందే ప్రస్తావించినట్లుగా ఈ పుస్తకంతోబాటు తీసుకు వచ్చిన మరో రెండు దాసుగారి పుస్తకాలు 'బొమ్మరిల్లు' ధారావాహిక 'మృత్యులోయ',(రూ.150/–) ; 'యువ' ధారావాహిక 'అగ్నిమాల'(రూ.60/–) పిల్లల్నీ పెద్దల్నీ అలరిస్తాయి. మూడూ చదివినవారికి దాసుగారి అసాధారణమైన, బహుముఖమైన సాహితీ ప్రతిభ వ్యక్తమవడమే కాకుండా, కథారచనలోని మెలుకువలు తెలుస్తాయి.

తెరవెనుక దాగొని దాసుగారు చేసిన కృషిని తెలుగు సాహిత్యాభిమానులకు తేటతెల్లంగా ఓ 'దాగని రహస్యం'లా వెల్లడి చేసిన 'రచన' శాయిగారు అభినందనీయులు. కీ.శే. దాసరి సుబ్రహ్మణ్యంగారికి ఆబాలగోపాలం తరఫునా స్మృత్యంజలులు!

– పి.వి.ఆర్.

*హనమకొండ : 23-02-2011*

*తాజాకలం :* ఈ సమీక్షా వ్యాసం రాసిన రోజు రాత్రే, అనగా 23-02-2011 రాత్రి, తెలుగు రాతల ఒరవడిని మార్చి, తెలుగు కథాసాహిత్యంలో తనదైన ముద్ర వేసుకొన్న శ్రీ ముళ్ళపూడి వెంకట రమణగారు స్వర్గస్థులైయ్యారు. దాసరి సుబ్రహ్మణ్యంగారి కథల సంపుటికి రూ.9999/– అర్థిక సహాయాన్నందజేస్తూ, 'రచన' ప్రత్యేక సంచిక ద్యారా దాసరివారి విశ్వరూపం తెలియ జేసినందుకు 'రచన'శాయిగారిని అభినందిస్తూ రాసిన 6-1-11 తేదీ లేఖని, ముళ్ళపూడి వెంకటరమణగారి స్వదస్తూరీతోనే యథాతథంగా పుస్తకం మొదటి పేజీలలో ప్రచురించడం జరిగింది.

ఒక గొప్ప రచయిత మరో గొప్ప రచయితకు అర్పించిన వినయాంజలికి యింతకంటే తార్కాణం ఏం కావాలి?

– పి.వి.ఆర్.

*హనమకొండ : 25-02-2011*

❖